వ్యంగ్య రచన

# శునకశ్రీ



రచన : —రమణశ్రీ

కనకారావుకు శునకానికి చాలాదగ్గర సంబంధం వుంది. ఆ మాటకొస్తే కనకారావు వంశంతోనే శునక జాతికి ఓ అవినాభావ సంబంధం వుంది.

కనకారావు తాతగారైన పానకాలరావుగారి దగ్గర ఓ పెద్ద దూడేలు లాంటి కుక్క వుండేది. అప్పట్లో ఆ కుక్క ఆయన దగ్గర వుండటం చాలా గొప్పగా భావించేవారు. ఆయన దగ్గర ఆ కుక్క వుందని తెలుసుకున్న తరువాతనే, ఆ వూరి జమీందారుగారు ఆయన్ను పిలిచి మరీ వుద్యోగమిచ్చారు. అప్పటి నుండి పానకాలరావుగారితో బాటు ఆ కుక్కకు గూడా విలువ పెరిగింది.

ఆ కుక్క పానకాలరావుగారి దైనందిన కార్యక్రమాలలో అతి చురుకుగా పాల్గొనేది.

తెల్లవారి లేవగానే బెడ్ కాఫీ, ఆ తరువాత జమీందారుగారితోపాటు విదేశీ మద్యం అన్నీ ఠంచన్ గా పుచ్చుకొనేది. అంతేగాక జమీందారుగారు వేటకు వెళ్ళేటప్పుడు పానకాలరావుగారితో కలిసి ఆ వేటను జయప్రదం చేసేది. ఆ రకంగా ఆ కుక్కగారికీ, వారి ద్వారా పానకాలరావుగారికీ చాలా పేరుప్రఖ్యాతులు లభించాయి.

ఆ తరువాత కనకారావు వంశానికి తండ్రి వెంకట్రావు వలన మరింత పేరుప్రఖ్యాతులు లభించాయి. ఆయనకు ఆ వూరివారంతా కలిసి 'శునకారావు' అని బిరుదు యిచ్చి ఉచితరీతిని సత్కరించారు. సార్థకనామధేయుడైన శునకారావు యింట్లో ఎల్లప్పుడూ కనీసం పది కుక్కలు వుండేవి. సదా ఆ కుక్కలు వెంకటరావును అంటిపెట్టుకొని వుండి అన్ని పనులలో తామూ పాలుపంచుకొనేవి. ఆ సందర్భంలోనే వెంకటరావు యింటికొచ్చే వారితో ఆ కుక్కలను చూపించి 'ఓ సంవత్సరం ఆలశ్యమైనా కుక్క లాంటి కొడుకు పుట్టాలి' అంటుండేవాడు.

కొన్నాళ్ళకు శునకారావు కోరిక ఫలించక, కనకారావు పుట్టాడు. అన్నీ తండ్రి పోలికలే!

వెంకటరావుగారి హయాం అయిపోయి కనకారావు శకం ప్రారంభమయింది. వెంకటరావుగారితో బాటే కుక్కల సంఖ్యగూడా తగ్గిపోయింది. అలా తగ్గిపోవడానికి కనకారావు చెప్పే బహు కారణాలలో 'శునక కుటుంబ నియంత్రణ' ఒకటి.

చిట్టచివరకు కనకారావుకు చేదోడు

వాదోడుగా ఓ శునకం మిగిలిపోయింది. దానికి ముద్దుగా (ప్రేకలా అంటాడుగానీ తండ్రి జ్ఞాపకార్థం) శునకారావు అని పేరు పెట్టుకున్నాడు

కనకారావుకు మల్లే ఆ కుక్కకు గూడా వారసత్వపు హక్కు సంక్ర మించింది. ఆ హక్కును పురస్క రించుకొని కనకారావు దైనందిన కార్య క్రమాలలో అతి చురుకుగా పాల్గొనేది ఆ శునకం.

కనకారావు తాతలనాటి జమీందారీలు యిప్పుడు లేవు. తండ్రినాటి ఉద్యోగ అవకాశాలు అంతకన్నా లేవు. ఉద్యోగం, సద్యోగం లేని కనకారావు బ్రతకడానికి ఏం చేయాలో తోచక సీరియస్‌గా కథలు వ్రాయడం మొదలు పెట్టాడు.

కనకారావు రచయితగా రూపాం తరం చెందడంలో తన శాయశక్తులా సహకరించింది శునకం.

సాహిత్యాన్ని పెంపొందించు కోవ డానికై కనకారావు గ్రంథాలయాల నుండి తెచ్చే పుస్తకాలన్నింటినీ అతి శ్రద్ధగా పరిశీలించేది శునకం వాటిలో మళ్ళీ కథలలో వుపయోగించడానికి పని కొచ్చే పేజీలను చక్కగా చింపి భద్ర పరిచేది. ఖాళీగా వున్నప్పుడు కథల గురించి ఎన్నో విషయాలు చూపులతోనే చర్చించేది శునకం.

కథలకు ప్లాటుకోసం ఇంగ్లీషు సినిమాకు వెళ్ళేటప్పుడు తప్పకుండా శునకాన్ని వెంట తీసుకు వెళ్ళేవాడు కనకారావు. కనకారావు కన్నా శ్రద్ధగా సినిమా చూసేది శునకం. ఆ సినిమాలలో తన జాతి వాళ్ళు కన్పించినప్పుడు ఆనందంతో కేరింతలు కొట్టేది శునకం. అలాంటి సమయాలలో పాపం కనకా రావు కాస్త యిబ్బంది పడినా, తనూ గట్టిగా నవ్వేసి ప్రక్కవాళ్ళచేత నవ్వింప చేసేవాడు.

సినిమా నుండి రాగానే కలం పట్టు క్కూర్చున్న కనకారావుకు ఎదురుగా బహు శ్రద్ధగా కూర్చుండేది శునకం. అలాంటి సమయాలలో కనకారావు ప్రక్కన టీ ఫ్లాస్కు లేకపోతే మహా గొడవ పెట్టేసేది శునకం.

ఆ రకంగా కూర్చొని తెల్లవారేసరికి పదిపేజీల కథ, ఫ్లాస్కుడు టీ పూర్తి చేసేవారు కనకారావు, శునకం కలిసి.

ఆ తరువాత కథోపాఖ్యానంలో చాలా చాలా మహత్కార్యాలు చేసేది శునకం, కనకారావు యిచ్చిన చీటీ, డబ్బులు తీసు కొని పోస్టాఫీసుకు వెళ్ళి స్టాంపులు పట్టు కొచ్చేది. కథను కవరులో పెట్టడం వరకే కనకారావు పని. ఆ తరువాత పని అంతా శునకారావుదే!

కవరుపై స్టాంపులంటించి, ఆ తరు వాత కవరంటించి, పోస్టు డబ్బాలో పడేసి, ఆ డబ్బా కొక నమస్కారం (కాళ్ళెత్తి) పెట్టేసి తిరిగొచ్చేది.

అంతటితో కనకారావు పని పూర్త యినా, శునకం పని పూర్తయ్యేది కాదు. ప్రతి రోజూ పోస్టుమాన్ కోసం కళ్ళుకాయలుకాచేటట్టు ఎదురుచూసేది.

పోస్టుమాన్ ఆ వీధిలోకి వచ్చి కన కారావు యింట్లోకి వెళ్ళకుండా ముందు కెళ్ళిపోతే శునకానికి మహాచెడ్డ కోపం వచ్చేసేది! ఆ కోపంతో పోస్టుమాన్‌ను

వీధి చివరవరకు తరిమి వచ్చేది.

ఆ తరుణంలో ఓరోజు శ్రుతిమించి పోస్టుమాన్ మంచాన పడ్డాడు. కనకారావు పైకి శునకాన్ని కేకలేసినా లోలోపల తన కథగురించి ప్రత్యుత్తరం తీసుకురాని పోస్టుమాన్‌కు తగిన శాస్తి జరిగినందుకు చాలా సంతోష పడిపోయాడు.

మూడు రోజుల తరువాత ప్రముఖ ప్రాంతీయ దిన పత్రికలో ఆ వీధిలోని వారి కందరికీ ఓ ప్రకటన వేయించాడు పోస్టుమాన్. "దయచేసి అంతా పోస్టాఫీసుకు వచ్చి లెటర్స్ పుచ్చుకొం"డని।

పాపం తను చేసిన ఆ తొందర పనికి ఎంతో బాధ పడింది శునకం. పశ్చాత్తాపంతో దహించుకు పోతూ తన పాప పరిహారానికై ప్రతిరోజూ కనకారావు తరపున పోస్టాఫీసుకు వెళ్ళ రాసాగింది.

ఓ మూడు నెలలు గడిచాక పోస్టుమాన్ బెదురుతూనే ఓ కవర్‌ను శునకాని కందించాడు. వాయువేగ మనోవేగాలతో కవరును నోట కరుచుకొచ్చిన శునకాన్ని చూడగానే నిప్పుతొక్కిన కోతిలా గంతు లేశాడు కనకారావు

అది సంతోష సూచకమేమోనని శునకం కూడా గంతు లేయడం ప్రారంభించింది.

కనకారావు చేతిలోని బెత్తం కూడా డాన్సు ప్రారంభించగానేగంతులగందర గోళం పతాక స్థాయికి చేరుకుంది.

ఆరు నిమిషాల యాభై సెకండ్ల తర్వాత హఠాత్తుగా తెలివి తెచ్చుకున్న కనకారావు శునకాన్ని ఒళ్ళోకి తీసుకొని అనవసరంగా కొట్టినందుకు 'సారీ' చెప్పాడు.

శునకం గూడా బాధ మర్చిపోయి కనకారావు మూతిని నాకుతూ 'నెవర్ మైండ్' చెప్పింది.

ఆ తరువాత ఆ కవరు ఏమిటో, అది ఎందుకు వచ్చిందో ఎపులంగా చెప్పాడు కనకారావు. తిరిగొచ్చిన కథను కవరులోంచి తీసి చూపెడుతూ '

అలాంటి కవరు అందించి నందుకు పోస్టుమాన్‌ను తిడుతూ కసితీరా పళ్ళు పటపట కొరికింది శునకం

ఆ తప్పు పోస్టుమాన్‌ది కాదని, పత్రికలో ఎడిటర్ అనే దుర్మార్గుడిదని చెప్పి శునకాన్ని శాంతింప చేశాడు కనకారావు

ఆ తరువాత మరో పదిరోజులు 'కాకా'వాడి టీకి గిరాకి పెరిగింది. కరెంటు మీటర్ గిర గిర తిరిగింది.

* * *

కాలగర్భంలో రెండు సంవత్సరాలు గడిచిపోయాయి

కనకారావుకు యిప్పుడు ఉద్యోగం చేయాలన్న బాధలేదు. అసలలాంటి విషయాలను ఆలోచించడానికే తీరిక లేదు.అతనిప్పుడొక ప్రఖ్యాతి రచయిత।

శునకానికి గూడా 'గ్రేడ్' పెరిగి ఫలానా శునకశ్రీ సహాయంతోనే ఆ రచయిత శ్రీ కథలు వ్రాస్తూంటాడు' అని అంతా గొప్పగా చెప్పుకుంటున్నారు

కనకరావు యింటికి ఎవరొచ్చినా ఓ పెద్ద బిస్కెట్ల పాకెట్ తీసుకొచ్చేవారు. అలా బిస్కెట్ పాకెట్ లేని

వ్యక్తిని సాహితీ విరోధిగా భావించి లోపలకు ప్రవేశం యిచ్చేది కాదు శునకం

అంతేకాదు, ఆ వచ్చిన వ్యక్తులు కనకరావు కథలను ఏమాత్రం విమర్శిం చినా, తీవ్రంగా నిరసన తెలియ చేసేది శునకం

ఇలాంటిశునకం తనకు అసిస్టెంట్‌గా దొరకడం తనుపూర్వజన్మలోచేసుకున్న పుణ్యఫలితంగా భావించేవాడు కనకారావు.

అందుకే మార్గశిర పౌర్ణమి రోజున కుక్కల పండుగను ఘనంగా జరిపే వాడు. కుక్క ఫ్రండ్సందరికీ ఆరోజు ఘనంగా పార్టీ యిచ్చేవాడు.

శునకరావు సాహచర్యంలో కనకారావు కథలు కాంగ్రెస్ నాయకుల వాగ్దానాలలా పరిమితి లేకుండా ప్రచురణ కాసాగాయి. కనకారావు పేరు లైసెన్సుల కుంభకోణంలో మిశ్రాలా జగద్విఖ్యాతి చెందింది.

కనకారావును తమ సంఘంలో చేరమంటూ అరసం, సరసం, విరసంలాంటి సాహితీ సంఘాల నుండి ఆహ్వానాలందాయి.

అప్పుడే కనకారావుకు ఓ బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది.

'తనే ఓ సంఘం ఎందుకు పెట్టగూడదు?'

తీవ్రంగా ఆలోచించి, శునకంతో చర్చించి, శునకారావు అధ్యక్షుడుగా, తను సెక్రటరీగా 'శురసం' [శునక రచయితల సంఘం] అనే సంఘాన్ని స్థాపించాడు; ప్రతి రచయితకు ఓ కుక్క అసిస్టెంట్‌గా వుండాలని సంఘ నిబంధనలలో స్పష్టంగా పేర్కొన్నాడు

'శురసం'కు వూహించని ప్రోత్సాహం వచ్చింది. ఓ నెలలోనే వంద మంది శునక రచయితలు ఆ సంఘంలో చేరారు.

ఆ సంవత్సరం ఓ ప్రముఖ పత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీలో కనకారావు వ్రాసిన కథకు ప్రథమ బహుమతి వచ్చింది. ఆ ఆనందంతో శునకాన్ని కావిలించుకొని బోకున పది ముద్దులు పెట్టేసి, పెట్టించుకున్నాడు కనకారావు.

ఈవార్త తెలిసిన వెంటనే 'శురసం' వారు కనకారావు + శునకారావులను సన్మానించడానికి పూనుకొని భారీఎత్తున ఏర్పాట్లు చేశారు. సభలో శునకాలకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేశారు.

ఆనాటి సభకు అధ్యక్షత వహించడానికి ఓ మంత్రిగారిని (జంతు శాఖ) ఆహ్వానించారు.

కనకారావు శునక సమేతంగా సభకు విచ్చేశాడు.

సభాసదులు గౌరవంగా లేచి నిలబడ్డారు.

మంత్రిగారు కనకారావును, శునకాన్ని పుష్పమాలాలంకృతులు గావించారు వారి గుణగణాలను అరగంటసేపు అనర్గళంగా పొగిడి, సాహిత్యం కేవలం మనుషులకే అంకితం గాకుండా పశు పక్ష్యాదులలో సహితం పెంపొందడం, తమ ప్రభుత్వ విజయాలకు చిహ్నమని, గనుక తమ ప్రభుత్వాన్ని కలకాలం నిలపమని ప్రార్థించి ముగిం

చారు.

కనకారావు మైక్ ముందు నిలబడి తమకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుతూ జవాబివ్వ సాగాడు.

"అధ్యక్షులు జంతు శాఖా మంత్రి గారికి, శునక రచయితలకు నా హృదయ పూర్వక అభివందనాలు. నేను యీనాడు ఓ ప్రముఖ రచయితనై, యీ సభలో ఉపన్యసిస్తున్నానంటే, దానికికారణం మా యీ శునకారావు. నిజానికి శునకారావుకు సాహిత్యమంటే ఎంతో యిష్టం. ఎప్పటికైనా సాహిత్యంలో 'పద్మశ్రీ' సంపాదించాలని మా శునకారావు ఆశయం।

కథ వ్రాయడం వరకే నా పని. ఆ కథను చక్కగా మడిచి కవరు లో పెట్టి పోస్టు చేయడం, ఆ తరువాత ప్రత్యుత్తరం కోసం ఓర్పుగా ఎదురు చూడటం, అప్పుడప్పుడు తిరిగొచ్చిన కథలను నేర్పుగా మార్పు చేయడం యిత్యాది పనులన్నీ మా శునకారావుకు ఉగ్గుతో పెట్టిన విద్య.

అంతేకాదు, నేను కథలు వ్రాయడంలో కూడా అమూల్యమైన సలహాలు అనేకంయిచ్చి తోడ్పడుతుంది. మధ్యలో వచ్చే అనుమానాలను సాహిత్యపరంగా చర్చిస్తుంది. మా శునకారావుతో సాగించే చర్చలే నాలో కొంగ్రొత్త ఆలోచనలకు బాటలు వేసేవి. నా కలం నుండి మరికొన్ని రచనలనుకురిపించేవి.

ఈవిధంగా నా సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని కృషి సల్పుతున్న మా శునకారావుకు యీ కథను ప్రేమతో అంకితం యిస్తున్నాను."

ఓ పూల దండవేసి కథ ప్రతిని శునకం నోటి కందించాడు కనకారావు.

పత్రికా విలేఖరుల ఫ్లాష్ కెమెరాలు తళుక్ తళుక్ మన్నాయి.

సభాసదుల కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి।

* • *

[ఈ కథ కేవలం కల్పితం, ఎవరినీ ఎట్టి పరిస్థితులలోనూ, ఉద్దేశించి వ్రాయ లేదు.]

దేవుడు మనిషికి అగ్నిని ప్రసాదించాడు.

మనిషి నిప్పు నార్పే యంత్రాన్ని కనుగొన్నాడు.

మనిషికి దేవుడు ప్రేమను యిచ్చాడు.

ప్రేమను ఆర్పేందుకు మనిషి 'పెళ్లి'ని ఏర్పాటు చేసుకున్నాడు.